క్లుప్తంగా

12న మండల సమావేశం

సారవకోట: ఈ నెల 12న మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆర్.రాంబాబు ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలన్నారు.

అంధకారంలో అండర్ టన్నెల్



చీకటిగా ఉన్న అండర్ టన్నెల్

ఆమదాలవలస రూరల్: పట్టణ శివారులో ఉన్న రైల్వే అండర్ టన్నెల్‌లో గత పది రోజుల నుంచి అంధకారం నెలకొంది. ఆమదాలవలస పట్టణం నుంచి మెట్టెక్కివలస, శ్రీకాకుళం, బీఆర్‌నగర్, గేటు, వెంగళరావుకాలనీలకు సులువుగా చేరుకునేందుకు ఈ అండర్ టన్నెల్ ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. వాహనదారులతో పాటు ప్రయాణికులు నిత్యం ఈ మార్గాన ప్రయాణం చేస్తుంటారు. ఎంతో రద్దీగా ఉండే ఈ అండర్ టన్నెల్‌లో వీధిదీపాలు మరమ్మతులకు గురికావడంతో చీకటిమయంగా మారుతుంది. మున్సిపల్ అధికారులు స్పందించి అండర్ టన్నెల్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పరామర్శ..



గోవిందరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: తండ్రీ, కూమార్తె మృతితో తీవ్ర విషాదంలో ఉన్న నారంశెట్టి గోవిందరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదివారం ఉదయం నరసన్నపేటలోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారం రోజుల వ్యవధితో గోవిందరావు, కుమార్తె పొడుగు నవ్య మృతి చెందారు. గోవిందరావు భార్య లక్ష్మి, కుమారుడు చైతన్య, ఇతర కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. నవ్య మృతిపై అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, తాను కూడా స్వయంగా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, పాట్నూరు సాయి ప్రసాద్, వైశ్యరాజు కేశవరాజు, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

కొత్తూరు: మండలంలోని నివగాం మొయిన్ రోడ్డు (పాలకొండ-హడ్డుబంగి)లో మురుగునీటి సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని గ్రామానికి చెందిన ఢిల్లేశ్వరరావు తదితరులు కోరారు. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు ఇళ్లల్లోకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులతోపాటు సర్పంచ్‌కు పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



పొన్నాంపేట వద్ద ప్రమాదకరమైన మలుపు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం నుంచి ఆమదాలవలస వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి మలుపుల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలోని అలమాజీపేట, చెవ్వాకులపేట, రామచంద్రాపురం గ్రామాల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నీలమణిదుర్గ ఆలయానికి భక్తుల తాకిడి



ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్కలాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని ఒడిశా, పాతపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. ఘటాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. పలువురు వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భూ హక్కు.. భూ రక్ష

- రీ సర్వేతో భూముల స్వచ్ఛీకరణ
- వాస్తవికత ఆధారంగా పట్టాదారు పాస్ పుస్తకాలు
- నరసన్నపేట నియోజకవర్గంలో 97 గ్రామాల్లో సర్వేపూర్తి
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు, భూ హక్కుదారులు



సర్వే అనంతరం గట్లుపై రాళ్లు పాతిస్తున్న అధికారులు

నరసన్నపేట: బ్రిటిష్ కాలం తరువాత చేపడుతున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం ద్వారా రైతులు, భూ హక్కుదారుల సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. భూముల కొలతలు, రికార్డుల స్వచ్ఛీకరణ రెవెన్యూ గ్రామాల్లో పూర్తిచేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే సిబ్బంది గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను బాధ్యతగా నిర్వహిస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని జలుమూరు, సారవకోట, పోలాకి, నరసన్నపేట మండలాల్లో 182 రెవెన్యూ గ్రామాలు ఉండగా 97 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. 69 గ్రామాల్లో రాళ్లు కూడా పాతారు. 42 గ్రామాల్లో పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. డ్రోన్ సర్వే 148 గ్రామాల్లో పూర్తయింది.

నియోజకవర్గంలో రెవెన్యూ గ్రామాలు, సర్వే వివరాలు

మండలం	రెవెన్యూ గ్రామాలు	సర్వే పూర్తయిన గ్రామాలు
నరసన్నపేట	45	28
పోలాకి	42	15
జలుమూరు	53	33
సారవకోట	42	21

ప్రతి కమతానికీ ఒక సర్వే నంబర్

ప్రతీ రైతు భూమిని సర్వే చేయాలని, ప్రతీ రైతు వివరాలు పరిశీలన చేసి వాస్తవికత ఆధారంగా పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన రెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే దీనిపై దృష్టి పెట్టి తక్కువ కాలంలోనే కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది అక్టోబర్ నెలాఖరుకల్లా సర్వే పూర్తిచేయాలనే లక్ష్యంతో రెవెన్యూ, సర్వే సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతీ గ్రామంలో ల్యాండ్ పార్శిల్ మ్యాప్ రూపొందించి, ప్రతి కమతానికీ ఒక సర్వే నంబర్‌ను ఇస్తున్నారు. ప్రస్తుతం ఒక సర్వే నంబర్ ఉంటూ దాంట్లో సబ్ డివిజన్లు ఏర్పాటు చేసి సర్వే నంబర్లు ఉన్నాయి. రీ సర్వేతో ప్రతి కమతానికి ఒక సర్వే నంబర్ ఇస్తున్నారు. ఒకటి నుంచి వరుసగా నంబర్లు నిర్ణయిస్తున్నారు. ఈ సర్వే నంబర్‌కు ఆధార్, ఫోను నంబర్లు లింక్ చేస్తున్నారు.



గోకయ్యవలసలో రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి

రీ సర్వే పకడ్బందీగా చేస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే పకడ్బందీగా చేస్తున్నాం. రీ సర్వే అనంతరం భూ సమస్యలు పరిష్కారమవుతాయి. ఒకవేల వచ్చినా వెంటనే పరిష్కారమవుతాయి. నరసన్నపేట మండలంలో ఒక ప్రణాళిక ప్రకారం సర్వే చేస్తున్నాం. మరో 17 గ్రామాల్లో సర్వే చేయాలి. డ్రోన్ సర్వే పూర్తికావడంతో అక్టోబర్ కల్లా రీ సర్వే పూర్తి చేస్తాం.

– ఎ. సింహాచలం, తహసీల్దార్, నరసన్నపేట

రైతుకు మేలు



ప్రతీ కమతానికి ఒక సర్వే నంబర్ ఇచ్చారు. దీనిని నమోదు చేసి పాస్ బుక్ ఇచ్చారు. రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరిగింది. గ్రామాల్లో భూ సమస్యలు చాలా మేరకు పరిష్కారం అవుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్ పట్టుదలతో భూముల రీ సర్వే చేయించి రైతులకు మేలు చేశారు.

– మొయ్యి లక్ష్మనాయుడు, రైతు, చిక్కాలవలస

భూ సమస్యలు పరిష్కారమయ్యాయి



చాలా ఏళ్ల తరువాత భూములు రీ సర్వే చేయడం వల్ల గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారమయ్యాయి. నా సమస్యలు కూడా పరిష్కారమయ్యాయి. ఏళ్ల కాలం నుంచి భూములు సాగు చేస్తున్నా పాస్ పుస్తకాలు రాలేదు. రీ సర్వేతో సమస్య తీరింది. ఆనందంగా ఉంది.

– ఎన్ని ఆనందరావు, రైతు, యారబాడు

విజయవాడకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నరసన్నపేట: మడపాం టోల్ గేట్ వద్ద జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరగనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సదస్సుకు నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ప్రధాన నాయకులు ఆదివారం తరలివెల్లారు. ప్రత్యేక బస్సును మడపాం టోల్ గేట్ వద్ద నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ జెండా ఊపి ప్రారంభించారు. సదస్సుకు ఎమ్మెల్యేతోపాటు డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ ప్రధాన కార్యదర్శులు ఇలా సదస్సుకు ఆహ్వానం వచ్చిన అందరూ పయనమయ్యారు. ఈ సదస్సుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. రానున్న ఎన్నికలకు దిశానిర్దేశం చేయనున్నారు.

ఎల్.ఎన్.పేట: విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం నిర్వహించనున్న పార్టీ ముఖ్య సమావేశంలో పాల్గొనేందుకు పాతపట్నం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని పాతపట్నం, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట, హిరమండలం, కొత్తూరు మండలాల నుంచి పార్టీ కేంద్ర నాయకులు ఇచ్చిన పిలుపుమేరకు ప్రజాప్రతినిధులు, మండల స్థాయిలో ముఖ్య నాయకులు తరలివెళ్లారని పెనుమజ్జి విష్ణుమూర్తి, సవిరిగాన ప్రదీప్ తెలిపారు.



ఎల్.ఎన్.పేట: విజయవాడకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



మాట్లాడుతున్న విష్ణుమూర్తి, పార్టీ నాయకులు

ఎల్.ఎన్.పేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత రాష్ట్ర అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం రిసెర్చ్ కేంద్రం, వారికి వంశధార తాగునీరు అందివ్వటంతోపాటు పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలకు వంశధార తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. సంక్షేమ పథకాలు అమల్లో దేశంలోనే ఆంధ్రాను నంబర్ వన్ స్థానంలో నిలిపారని కొనియాడారు. రాజకీయాలతో పనిలేకుండా అర్హత ఉంటే సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాలన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు తీసుకువచ్చారన్నారు. రైతులు, మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజల్లో సీఎం జగన్‌కు రోజురోజుకూ పెరుగుతున్న ప్రజాఆదరణ చూసి ఓర్వేలేక టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజల కోసం చేసింది ఏమీ లేదన్నారు. అవినీతి, భూముల ఆక్రమణలు, స్కామ్‌లు తప్ప చంద్రబాబు పాలనలో ప్రజలకు మేలు జరగలేదన్నారు. ఆ పార్టీ కార్యకర్తలకు, నాయకులకే పథకాలు మంజూరు చేశారన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు రెడ్డి లక్ష్మణరావు, ఈగల చిన్నారావు, పొన్నాన ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

80 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాతపట్నం: మండలంలోని తెంబూరు గ్రామ సచివాలయం సమీపంలో గల సత్యసాయి బాబా మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యులు ఎస్.అంజలి, బి.భారతి 80 మందికి కంటి వైద్య పరీక్షలు చేపట్టారు. 30 మందికి కంటి చికిత్సలకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి వైద్య శిబిరాన్ని బోయిన చంద్రమౌళి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కో ఆర్డినేటర్ రామారావు, అంధవరపు కామేశ్వరరావు, బాలకృష్ణ, కూర్మాపు సాయిశంకర్, మిశ్రో సంతోష్, సేవాదళ్ సభ్యులు, బాబా సేవా సమితి సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ



తూటికాడ కషాయాన్ని తయారుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: తూటికాడ కషాయంతో వరిలో దోమపోటు నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం లబ్బ యూనిట్ ఇన్‌చార్జి గోవిందరావు అన్నారు. మండలంలోని సోమరాజపురంలో ఆదివారం తూటికాడ కషాయం తయారీ విధానం, కావాల్సిన సామగ్రిపై అవగాహన కల్పించారు. తూటికాడ కషాయం తయారుచేసి రైతులకు చూపించారు. వరి పంటకు దోమపోటు వచ్చిననప్పుడు తక్కువ ఖర్చుతో తయారు చేసిన తూటికాడ కషాయాన్ని పిచకారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీలు వి.సుధ, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

నవంబర్ 9న సీతారాముల కల్యాణోత్సవం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సేవాదళం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నవంబరు 9న సీతారామచంద్ర స్వామి కల్యాణం వేడుకలు, స్వర్ణ పాదుకా పుష్పాభిషేకం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు తెలిపారు. నారాయణ తిరుమలలోని మండపంలో ఆదివారం ఆహ్వాన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా అయోధ్య శ్రీరామాలయ నిర్మాణంలో ఏర్పడిన ప్రతిష్టంభన వీడి ప్రతిష్టాపన మహోత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో ఇక్కడ నవంబర్ 9న ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నామని చెప్పారు. జిల్లాకేంద్రంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించేందుకు సిద్ధమయ్యామని పేర్కొన్నారు. దేశమంతా రామచంద్రుని పాదుకలతో మహాపాదయాత్ర జరుగుతుందని, నారాయణ తిరుమల దేవస్థానం అభ్యర్థన మేరకు నవంబరు 9న బంగారు పాదుకలను శ్రీకాకుళంలోని ఉత్సవ వేదిక వద్ద భక్తులు దర్శించుకునే అవకాశం కలిగిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి పాదులకు పుష్పాభిషేకం చేసుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. రామతీర్థాలు క్షేత్రం నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను తెచ్చి రెండు వేల మంది దంపతుల సమక్షంలో కల్యాణ వేడుకలు నిర్వహిస్తామన్నారు. నారాయణ తిరుమల ధార్మిక సంస్థ, వేంకటరామానుజ సేవాదళం తగిన వనరులు అందిస్తాయని తెలిపారు. ఇందుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. భద్రాచలం నుంచి శ్రీసీతారామచంద్రుని లాంఛనాలు పొందే భాగ్యం కలుగుతుందని తెలిపారు. సమావేశంలో సేవాదళం సభ్యులు పొన్నాడ ధర్మారావు, వెంకటేశ్వర్లు, బొడ్డేపల్లి నాగభూషణం, ఎన్ని రాజేశ్వరరావు, ఆర్.వి.ఎస్.శర్మ, వేణుగోపాల్, సేవాదళ సభ్యులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా వరప్రసాద్



వరప్రసాద్

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస మండల ప్రత్యేక అధికారిగా రత్నాల వరప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాద్ ప్రస్తుతం జిల్లా ఉద్యానవన అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ఈయనకు మండల ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రసాద్ గతంలో కంచిలి, ఇచ్ఛాపురం, మందస మండలాల్లో ప్రత్యేకాధికారిగా పనిచేశారు. కోవిడ్ సమయంలో కంచిలి మండల ప్రత్యేక అధికారిగా చేసిన సేవలను గుర్తించి అప్పట్లో జిల్లా కలెక్టర్ ద్వారా ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష, ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో ఆయన సేవలను ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల మన్ననలు పొందుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌-స్టేషన్ పరిధి 11 కేవీ టౌన్‌-1, ఆమదాలవలస రూరల్ ఫీడర్‌లో గల ఎఫ్‌సీఐ జంక్షన్‌లో విద్యుత్ స్తంభాలు వేయడం జరిగిందని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.భయ్యాన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ స్తంభాలకు విద్యుత్ తీగలు అమర్చే పనులు మంగళవారం నిర్వహిస్తామన్నారు. అదే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సొట్టవానిపేట, టి.జి.ఆర్.నగర్, ఎఫ్‌సీఐ, భైరవానిపేట, శిలగాంసింగివలస, సీపానచంద్రయ్యపేట, వంజంగి, గట్టుముడిపేట, దూసి, దూసి కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నవ్య కుటుంబానికి న్యాయం చేయాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

సారవకోట: నరసన్నపేటలో ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన నవ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలో వైస్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శనివారం ఆమె తండ్రి కూడా ఆత్మహత్య చేసుకుని మృతి చెందారని, దీనికి కారకులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు



కలెక్టర్ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శెల్వరాజన్, ఆమె భర్త, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం నూతనంగా నిర్మించిన గోశాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి, శ్రీకాకుళం జేసీ నవీన్‌లు ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌ను గోత్రనామాలతో పూజలు చేశారు. అనంతరం శ్రీకూర్మనాయకి పూజలు జరిపించి వైష్ణవీ దుర్గ, తాబేళ్ల పార్కును సందర్శించారు. ఈవో జి.గురునాథం క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు.

ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ కామేశ్వరరావు

గార: మండలంలోని ముఖ్యమైన కూడళ్లలో స్థానికుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని సీఐ ఎస్.కామేశ్వరరావు ఆదివారం తెలిపారు. ప్రమాదాలు, నేరాలు, దొంగతనాలు జరిగే సమయంలో ఆధారాల సేకరణకు సీసీ కెమెరాలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. వాడాడ, పూసర్లపాడు, కళింగపట్నం, తూలుగు, వమరవల్లి, సాలిహుండం జంక్షన్‌లలో వీటిని అమర్చుతామని చెప్పారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేయస్తామన్నారు. కార్యక్రమంలో టి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతికి అష్టోత్తర పుస్తకార్చన

శ్రీకాకుళం కల్చరల్: పట్టణానికి చెందిన కాశిని వెంకటేశ్వరరావు రచించిన శ్రీవాణి వికాసం పుస్తకాలతో రాజాంలో ఉన్న జ్ఞానసరస్వతి అమ్మవారికి అష్టోత్తర పుస్తకార్చనలు ఆదివారం నిర్వహించారు. అక్షరాభ్యాసాలు చేస్తున్న చిన్నారులకు వీటిని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రంపరామచంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.